నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం

ప్రజాశక్తి - ఏలూరు

జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఏలూరులో ఈ నెల 25వ తేదీ శనివారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. శనివారం ఉదయం తొమ్మిది గంటలకు ఏలూరు కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహిస్తారని పేర్కొన్నారు. తొలుత 8.30 గంటలకు ఏలూరు ఇండోర్ స్టేడియం నుండి జాతీయ ఓటర్ల దినోత్సవం ర్యాలీ నిర్వహిస్తారని తెలిపారు.

ఓటుహక్కు నమోదు, వినియోగంపై, ఓటుహక్కు ప్రాముఖ్యతపై నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తారని పేర్కొన్నారు. అనంతరం సీనియర్ ఓటర్లకు సన్మానం ఉంటుందని, అందరూ జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమంలో పాల్గొనాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

బడ్జెట్‌లో చూపారు.. ఇవ్వడం మరిచారు..!

ఈ ఏడాది 'అన్నదాత సుఖీభవ' ఇస్తున్నట్టా.. లేనట్టా అంటూ చర్చ

సూపర్ సిక్స్‌లో రైతుకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు హామీ

రబీ నాట్లు చివరి దశకు చేరినా ప్రభుత్వ స్పందన కరువు

అసెంబ్లీలో నవంబర్‌లో పెట్టిన బడ్జెట్‌లో రూ.4,500 కోట్లు కేటాయింపు

మళ్లీ బడ్జెట్ సమావేశాలు సమీపిస్తున్నా రైతుకు చేరని సాయం

రెండు జిల్లాల్లో 2.50 లక్షల మంది రైతులు ఎదురుచూపు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'మాది రైతు ప్రభుత్వం.. అన్నదాతకే మా ప్రభుత్వంలో పెద్దపీట' అంటూ కూటమి సర్కార్ చెబుతున్న మాటలకు, చేతలకు పొంతన లేకుండా పోయిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సూపర్ సిక్స్ పేరుతో కూటమి మేనిఫెస్టోలో పెట్టిన రైతుకు పెట్టుబడి సాయం హామీ ఎప్పటికి అమలు చేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. బడ్జెట్‌లో నిధులు కేటాయించినా రైతుకు మాత్రం సాయం సొమ్ము అందని పరిస్థితి ఏర్పడింది. రెండు జిల్లాల్లో దాదాపు 2.50 లక్షల మంది రైతులు పెట్టుబడి సాయం కోసం కళ్లుకాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు.

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 80 శాతం ప్రజలు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. రెండు జిల్లాల వృద్ధిరేటులో 60 శాతానికిపైగా ఆదాయం వ్యవసాయంపైనే వస్తున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. రెండు జిల్లాల్లో ఆరు లక్షల మందికిపైగా రైతులు వివిధ పంటలను సాగు చేస్తున్నారు. 2024 మే నెలలో జరిగిన ఎన్నికల్లో టిడిపి కూటమి రైతులకు అనేక హామీలు ఇచ్చింది. కూటమి ప్రకటించిన సూపర్ సిక్స్ హామీల్లో ప్రధానమైంది రైతులకు ఏడాదికి పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు అందించడం. కూటమి అధికారంలోకి వచ్చాక పెట్టుబడి సాయం పథకానికి 'అన్నదాత సుఖీభవ' అంటూ పేరును సైతం పెట్టింది. 2024 నవంబర్ 11న అసెంబ్లీలో ప్రవేశపెట్టిన వ్యవసాయ బడ్జెట్‌లో పెట్టుబడి సాయం కింద ఈ ఏడాదికి రూ.4,500 కోట్లు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకూ

ఒక్కపైసా కూడా రైతులకు పెట్టుబడి సాయం కింద అందలేదు. రెండు జిల్లాల్లో పిఎం కిసాన్ కింద సొమ్ము అందుకుంటున్న రైతులు దాదాపు 2.50 లక్షల మంది వరకూ ఉన్నారు. ఈ పథకం అందని రైతులు ఎంతోమంది ఇంకా ఉన్నారు. అన్నదాత సుఖీభవకు రైతుల అర్హుల జాబితా రూపొందించి అమలు చేయాల్సిన ప్రభుత్వం నోరు మెదపడం లేదు. దీంతో ఈ ఏడాది రైతులకు పెట్టుబడి సాయం అందేనా అనే చర్చ రైతుల్లో సాగుతోంది. గత ప్రభుత్వం రైతుభరోసా కింద ఇచ్చిన పెట్టుబడి సాయం రెండు విడతలుగా రైతుల ఖాతాల్లో జమ చేసేది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రూ.ఆరు వేలు కాకుండా, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే రూ.7,500లో మే చివరి వారంలో మొదటి విడతగా రూ.5,500, జనవరిలో రెండో విడతగా రూ.రెండు వేలు రైతుల ఖాతాల్లో జమ చేసేది. దీంతో మొదటి విడత సొమ్ము ఖరీఫ్ సాగుకు, రెండో విడత సొమ్ము రబీ సాగుకు రైతులు ఉపయోగించుకునేవారు. కూటమి ప్రభుత్వం జూన్‌లో కొలువుదీరింది. వ్యవసాయానికి పెద్దపీట వేస్తామని ప్రభుత్వం చెప్పడంతో ఖరీఫ్ సాగుకు పెట్టుబడి సాయం అందిస్తుందని రైతులు భావించారు. అమలుకు మాత్రం నోచుకోలేదు. రబీ సాగుకైనా ఇస్తారని రైతులు ఆశలు పెట్టుకున్నారు. రబీ నాట్లు పూర్తయిపోయాయి. ముందుగా నాటిన నాట్లు మరో నెల రోజుల్లో మాసూళ్లకు దగ్గర పడుతున్నాయి. ఇప్పటికీ ప్రభుత్వం రైతు పెట్టుబడి సాయం సొమ్ము గురించి నోరు మెదపడం లేదు. దీంతో రైతులకు పెట్టుబడి సాయం అందుతుందా అనే ప్రశ్న అందరినీ వేధిస్తోంది. ధాన్యం సొమ్ము సకాలంలో జమ చేసినప్పటికీ పెట్టుబడి సాయం ఇవ్వకపోవడంతో ప్రభుత్వంపై రైతుల్లో అసంతృప్తి నెలకొంది.

మళ్లీ బడ్జెట్‌కు వేళాయే..

ఈ ఆర్థిక సంవత్సరం మరో రెండు నెలల్లో పూర్తికానుంది. ఫిబ్రవరి ఒకటో తేదీన కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో 2025-26 బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. మార్చి మొదటివారంలో రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బడ్జెట్ పెట్టే పరిస్థితి ఉంది. గత బడ్జెట్‌లో రైతులకు పెట్టుబడి సాయం కింద కేటాయించిన సొమ్ము రూ.4,500 కోట్లలో చిల్లిగవ్వ కూడా విడుదల చేయలేదు. ఇది రైతుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. రైతులను ఏమార్చేందుకు ఇలా చేశారా అనే అనుమానాలు నెలకొన్నాయి. ప్రభుత్వం హామీ ఇచ్చినట్లుగా వెంటనే పెట్టుబడి సాయం సొమ్ము అందించాలని రైతులు కోరుతున్నారు. ముఖ్యంగా కౌలురైతులకు పెట్టుబడి సాయం అందుతుందా, లేదా అనే ఆందోళన నెలకొంది. వాస్తవ సాగుదారుడైన కౌలురైతులకు పెట్టుబడి సాయం అందించినప్పుడే వ్యవసాయం ముందుకు సాగే పరిస్థితి ఉంటుంది.

అగ్ని కీలల్లో ఇళ్లు

ఘోర అగ్నిప్రమాదం

15 ఇళ్లు దగ్ధం

ఆరుగురికి గాయాలు

ప్రజాశక్తి - మండవల్లి

మండలంలో ప్రత్తిపాడు స్టేజీ వద్ద శుక్రవారం రాత్రి జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో 15 ఇళ్లు కాలి బూడిదయ్యాయి. ఆరుగురు గాయాలపాలయ్యారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. చేపల చెరువులపై పిట్టలు కొట్టేవారు (నక్కలోళ్లు) 25 ఏళ్లుగా మండలంలోని ప్రత్తిపాడు స్టేజీ వద్ద ప్లాస్టిక్ బరకాలతో పూరిల్లు ఏర్పాటు చేసుకుని నివాసం ఉంటున్నారు. శుక్రవారం రాత్రి ఒక ఇంట్లో వంట చేస్తుండగా గ్యాస్ లీకై ప్రమాదవశాత్తూ నిప్పంటుకుంది. దీంతో మంటలు చెలరేగాయి. ఆ మంటలు వ్యాపించి సుమారు 15 ఇళ్లు కాలి బూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో ఒకే ఇంటిలోని ఆరుగురు గాయాలపాలయ్యారు. వారిలో ఒక మహిళ, ఒక బాలుడు, నలుగురు పురుషులు ఉన్నారు. ప్రతి ఇంట్లో గ్యాస్ సిలెండర్, బైక్ ఉండడంతో మంటల్లో అవి పేలి పెద్దఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. దీనికితోడు వీరు పిట్టలు కొట్టేందుకు ఉపయోగించే ఫాస్పరస్ ప్రతి ఇంట్లో ఉంది. మంటలకు ఆ ఫాస్పరస్ పేలుతుంది. దీంతో మంటలను అదుపు చేసేందుకు ఎవరూ ముందుకు వెళ్లలేని పరిస్థితి. ఫైర్ సిబ్బందికి సమాచారం అందించినా రాలేదని స్థానికులు చెబుతున్నారు. క్షతగాత్రులను స్థానికులు కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న డిఎస్‌పి శ్రావణ్‌కుమార్, కైకలూరు టౌన్, రూరల్ సిఐలు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

క్షతగాత్రుడు

ఉల్లాసంగా..ఉత్సాహంగా

ఘనంగా హేలాపురి బాలోత్సవం

ఐదో పిల్లల సంబరాలు ప్రారంభం

మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్, సిటీ

చిన్నారుల సందడి.. ఆటపాటలు..ఉత్కంఠభరితమైన పోటీలతో హేలాపురి బాలోత్సవం శుక్రవారం ప్రారంభమైంది. హేలాపురి బాలోత్సవం ఐదో పిల్లల సంబరాలు వట్లూరులోని సిద్ధార్థ క్వెస్ట్ స్కూల్‌లో శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలుత ఎన్‌సిసి లెఫ్టినెంట్ కల్నల్ రిబెష్‌సింగ్ జాతీయ జెండాను ఆవిష్కరించగా, బాలోత్సవం జెండాను ఉషా గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్స్ అధినేత ఉషాబాలకృష్ణ ఆవిష్కరించారు. అనంతరం బాలోత్సవం ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభలో ముఖ్యఅతిథులుగా పిడిఎఫ్ ఎంఎల్‌సి బి.గోపీమూర్తి, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి పాల్గొన్నారు. సభాధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ బాలోత్సవాన్ని 2019లో ఏలూరులో తొలిసారి ప్రారంభించినట్లు తెలిపారు. ఐదో పిల్లల సంబరాలకు 170 స్కూళ్ల నుంచి సుమారు పది వేల మంది విద్యార్థులు తమ పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి మాట్లాడుతూ ఈ బాలోత్సవం ప్రారంభోత్సవానికి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. చిన్నప్పటి నుంచి పిల్లలకు దేనిలో అభిరుచి ఉందో గుర్తించి దానిపై ప్రోత్సహిస్తే వారు జీవితంలో మంచి స్థానానికి వచ్చేందుకు ఆస్కారం ఉందన్నారు. ఎంఎల్‌సి గోపీమూర్తి మాట్లాడుతూ పిల్లలకు చిన్నప్పటి నుంచి ఒక శాస్త్రీయ దృక్పథం అలవర్చాలన్నారు. ప్రస్తుత విద్యా వ్యవస్థ ఆ విధంగా విద్యార్థులను తీర్చిదిద్దడంలో విఫలమైందన్నారు. వినోదం, వికాసంతోపాటు జాతీయ సమైక్యత, శాస్త్రీయ దృక్పథం వంటివి పిల్లల్లో పెంపొందించాలనే లక్ష్యంతో బాలోత్సవం ఐదేళ్లుగా నిర్వహించడం అభినందనీయమన్నారు. సంక్రాంతి అంటే పేకాట, గుండాట, కోడిపందేలు అనే ఆలోచన పెద్దలతోపాటు పిల్లల్లో కూడా పెరిగిపోయిందన్నారు. వాటికి సంక్రాంతి మూడు రోజులు విచ్చలవిడిగా అనుమతులిచ్చి, ఆకివీడులో 42 సంవత్సరాల నుంచి ఆటల పోటీలు నిర్వహిస్తుంటే దానికి సిఇఒ, డిఇఒ తొలుత అనుమతులు నిరాకరించి, చివరి క్షణంలో అనుమతులివ్వడం బాధాకరమని అన్నారు. సిఆర్ రెడ్డి కళాశాల జనరల్ సెక్రటరీ మాగంటి ప్రసాద్, నెక్స్‌జన్ సంస్థ ఎమ్‌డి అడుసుమిల్లి వెంకట సుబ్రహ్మణ్యం, నాగ హనుమాన్ సంస్థ డైరెక్టర్ పి.భాస్కర్ మాట్లాడుతూ ఈ పిల్లల సంబరాలకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. సిద్ధార్థ స్కూల్ డైరెక్టర్ కోనేరు సురేష్‌బాబు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఆర్.రవికుమార్, బాలోత్సవం నిర్వాహక కమిటీ అధ్యక్షులు అడుసుమిల్లి నిర్మల, శ్రీశ్రీ విద్యాసంస్థల అధినేత ఎంబిబిఎస్.శర్మ, కల్చరల్ ఈవెంట్ కోఆర్డినేటర్ పి.మంగరాజు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ముస్తఫాఆలీ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్‌సి గోపీమూర్తి



చిత్రలేఖనం పోటీల్లో చిన్నారులు

విద్యార్థినుల నృత్య ప్రదర్శన

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

పిల్లల సంబరాల్లో విద్యార్థులు అద్భుతమైన ప్రతిభాపాటవాలు ప్రదర్శించారు. శాస్త్రీయ, జానపద నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా జానపద బృంద నృత్యాలకు ప్రేక్షకులు మైమరిచిపోయారు. అభ్యుదయ గీతాలు, కోలాట ప్రదర్శనలు, దేశభక్తి గీతాల పోటీల్లో విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. చిత్రలేఖనం, కథా రచన, కవితా రచన, మైక్రో ఆర్ట్స్, మ్యాజిక్, ఏకపాత్రాభినయం వంటి అంశాల్లో విద్యార్థులు వయస్సుతో సంబంధం లేకుండా పోటీపడి తమ ప్రతిభను కనబరిచారు. ఆత్మ రక్షణ కోసం ఉపయోగించే కర్ర సాము పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడం విశేషం.

బాలికలు అన్నింటా రాణించాలి

కలెక్టర్‌తో కలిసి మహిళల బైక్ ర్యాలీని ప్రారంభించిన ఎంఎల్‌ఎ బడేటి చంటి

సెల్ఫీ పాయింట్ వద్ద కలెక్టర్, ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

బాలికలకు సామాజికంగా, ఆర్థికంగా, మానసికంగా భరోసానివ్వాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో జిల్లా మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎంఎల్‌ఎ బడేటి రాధాకృష్ణయ్య (చంటి)తో కలిసి జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక అమలోద్భవి సెంటర్ నుంచి సెయింట్ థెరిస్సా కళాశాల వరకు నిర్వహించిన బైక్ ర్యాలీని కలెక్టర్ వెట్రిసెల్వితో కలిసి ఎంఎల్‌ఎ బడేటి చంటి ప్రారంభించారు. అనంతరం సంతకాల సేకరణలో కలెక్టర్, ఎంఎల్‌ఎ సంతకాలు చేశారు. ఆడపిల్లలను సంరక్షించి విద్యావంతులను చేస్తామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆడపిల్లల పట్ల ఎలాంటి వివక్షా లేకుండా చూసేందుకు ఎన్నోచట్టాలు ఉన్నాయన్నారు. లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ సెంటర్లపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆడపిల్లల భద్రతకు ఎక్కడైనా భంగం కలిగితే వెంటనే 1098 నెంబరుకు సమాచారం అందించాలన్నారు. ప్రతి బాలిక విద్య అభ్యసించాలన్నారు. ఎంఎల్‌ఎ బడేటి చంటి మాట్లాడుతూ బాలికలు విద్యావంతులయ్యేందుకు ప్రభుత్వం ఎన్నో అవకాశాలు కల్పించిందన్నారు. ఐటి రంగంలో ఎక్కువ మంది మహిళలకు ఉద్యోగావకాశాలు వస్తున్నాయని, దీనికి కారణం వాళ్లు విధుల్లో చూపించే ప్రత్యేక శ్రద్ధే కారణమన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా కలెక్టర్ సమక్షంలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎనిమిది మంది బాలికలతో ప్రదర్శించిన లంబాడీ ఫోక్ డ్యాన్స్, ఆరుగురు బాలికలు ప్రదర్శించిన ఆడపిల్లలను సేవ్ చేయు థీమ్, ఏడుగురు బాలికలతో అరుపు సాంగ్ తదితర ప్రదర్శనలు అందరినీ అబ్బురపర్చాయి. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ క్రీడా, సాంస్కృతిక పోటీల్లో పాల్గొని గెలుపొందిన బాలికలకు కలెక్టర్ మెమెంటోలు అందజేశారు. సమావేశంలో సెయింట్ థెరిస్సా కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ మెర్సీ, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్, ఐసిడిఎస్ పీడీ పి.శారద, డిసిపిఒ సూర్యచక్రవేణి, జిల్లా యువజన అధికారి దూలం కిషోర్, డిఎస్‌డిఒ శ్రీనివాసరావు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, అంగన్వాడీలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సురక్షిత హెల్మెట్ ధారణ తప్పనిసరి

1 నుంచి ప్రభుత్వ ఉద్యోగులతో అమలు

జిల్లా రోడ్డు సేఫ్టీ కమిటీ సమావేశంలో

కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్

మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాలకు వాహనాలపై వచ్చే ఉద్యోగులు ఫిబ్రవరి 1 నుంచి తప్పనిసరిగా హెల్మెట్ ధరించి రావల్సిందేనని కలెక్టర్ కె.వెట్రిసెల్వి స్పష్టం చేశారు. శుక్రవారం జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్‌తో కలిసి కలెక్టర్ వెట్రిసెల్వి రహదారి భద్రతా, రోడ్డు భద్రతా వారోత్సవాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాహన చోదకుల నిర్లక్ష్యం, ఇతర కారణంగా చోటు చేసుకుంటున్న ప్రమాదాలు వారి కుటుంబాలను తీవ్ర మనోవేదనకు గురి చేస్తున్నారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని రోడ్డు భద్రతా నియమాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఇప్పటికే ఈ విషయంపై అన్ని స్థాయిల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. హెల్మెట్ ధారణపై మరింత విస్తృత చర్యల్లో భాగంగా తొలిగా ప్రభుత్వ కార్యాలయాలకు వాహనాలపై వచ్చే ఉద్యోగులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలనే నిబంధన ఫిబ్రవరి 1 నుంచి అమలు చేయాలన్నారు. కళా శాలలకు వచ్చే విద్యార్థులు కచ్చితంగా హెల్మెట్ ధరించి రావాలనే నిబంధన ఆయా యాజమాన్యాలు అమలు చేయాలన్నారు. కళాశాలకు వచ్చే వాహనదారులు హెల్మెట్ ధరించి రాకపోతే నో ఎంట్రీ అని స్పష్టం చేయాలన్నారు.ఆర్‌టిసి బస్సులను స్పీడ్ పరిమితి దాటి వేగంగా నడిపితే సంబంధిత ఫోన్ నెంబరుకు సమాచారం అందించాలనే స్టిక్కర్లను ప్రతిబస్సుపై అతికించాలని ఆర్‌టిసి అధికారులను ఆదేశించారు. సత్రంపాడు బ్రిడ్జి వద్ద రోడ్డు వెడల్పుకు అవసరమైన మార్గాలను అన్వేషించి ప్రతిపాదనలు అందించాలని ఆర్‌అండ్‌బి అధికారులను ఆదేశించారు. గుడ్ సమ్మటరిన్‌పై ప్రతిఒక్కరికీ అవగాహన కలిగించాలన్నారు. ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ మాట్లాడుతూ హెల్మెట్ తప్పనిసరని, లేదంటే ఎంట్రీ నిషిద్ధమనే అంశాన్ని ప్రభుత్వ కార్యాలయాలు, కళాశాలలు, విద్యా సంస్థల్లో కచ్చితంగా అమలుచేసి మిగిలిన ప్రజలకు ఆదర్శంగా నిలవాలన్నారు. కొంతమంది డ్రైవర్లు ఆర్‌టిసి బస్సులను అతివేగంగా నడుపుతున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. స్పీడ్ లిమిట్ దాటి బస్సు నడిపే డ్రైవర్లపై చర్యలు తీసుకోవాలన్నారు. కొన్ని మోటారు షోరూంలలో మోటారు బైక్‌లకూ మోడిఫై చేసిన సైలెన్సర్లు, అత్యంత కాంతినిచ్చే లైట్లను అమర్చుతున్నారన్న అంశం తమ దృష్టికి వచ్చిందని, ఇటువంటి వాటిని నియంత్రించేందుకు రవాణాశాఖ అధికారులు ఆయా మోటారు షోరూంలను తనిఖీ చేయాలని సూచించారు. ఈ సమా వేశంలో ఇన్‌ఛార్జి ఉప రవాణా కమిషనర్ కెఎస్ఎంవి.కృష్ణారావు, జంగారెడ్డిగూడెం ఆర్‌టిఒ మహ్మద్ మదాని, జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, ఆర్‌అండ్‌బి ఎస్ఇ జాన్‌మోషే, జిల్లా ప్రజా రవాణాధికారి వరప్రసాద్, మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్, డిఎంహెచ్ఒ డాక్టర్ మాలిని, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఎస్‌బి శేఖర్, ఎండి విఠల్, ఆజ్మీరాబద్దు, జి.స్వామి, కళ్యాణి, నరేంద్రబాబు, పలువురు ఎన్‌హెచ్ అధికారులు, పోలీస్, రవాణా శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణపై విచారణ జరపాలి

గిరిజనేతర భూస్వామిపై చర్యలు తీసుకోవాలి

జెసికి సిపిఎం వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

30 సంవత్సరాలుగా గిరిజనులు సాగు చేస్తున్న భూమిని గిరిజనేతర భూస్వామి అక్రమంగా ఆక్రమించుకోవడంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ జీలుగుమిల్లి మండలం సిరివారిగూడెం కోయ గిరిజనులు ఆర్ఎస్ నెం:189/1, 2, 193/1, 1ఎ, 2లలో 14.7 ఎకరాల భూమిని గత 30 సంవత్సరాలుగా సాగు చేస్తున్నారని, ఇటీవల కాలంలో గిరినేతర భూస్వామి కోడూరు కృష్ణవేణి ఈ భూమిని తాను కొనుగోలు చేశానని గిరిజనులను సాగు చేయనివ్వకుండా అడ్డుకుంటున్నారన్నారు. పైగా తహశీల్దార్, ఆర్‌డిఒల నుండి ప్రొటెక్షన్ ఆర్డర్లతో, పోలీసుల సహకారంతో భూమిలోకి ప్రవేశించి భీతావహం సృష్టిస్తున్నారన్నారు. దీనిపై మండల అధికారులకు ఫిర్యాదు చేసినా రికార్డులు పరిశీలన చేయకుండా ఏకపక్షంగా రెవెన్యూ అధికారులు వ్యవహరిస్తున్నారని, ఈ భూమిపై జంగారెడ్డిగూడెం సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో ఇసి సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేయగా సదరు భూముల్లో 1959 నుండి 1982 వరకు ఎటువంటి అమ్మకాలు, కొనుగోళ్లు జరగలేదని తేలిందన్నారు. 1959లో రేపాక చినపెరుమాళ్ల పేరుతోనే రికార్డుల్లో ఉందని, ఆన్‌లైన్ విధానం వచ్చిన తర్వాతే కోడూరి కృష్ణవేణి పేరు అక్రమంగా రెవెన్యూ వారికి లంచాలు ఇచ్చి నమోదు చేయించుకున్నారని, ఆమె కొనుగోలు చేసినట్లుగా ఎటువంటి రికార్డులూ ఏ సందర్భంలోనూ చూపించలేదని తెలిపారు. గిరిజనులు సాగు చేస్తున్న భూమికి రక్షణ కల్పించాలని, ఉభయుల రికార్డులు పరిశీలించి చట్ట విరుద్ధంగా తహశీల్దార్, ఆర్‌డిఒలు ఇచ్చిన ప్రొటెక్షన్ ఆర్డర్లు రద్దు చేయాలని, గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు.

పెండింగ్ పిఎఫ్, బకాయి జీతాలు చెల్లించాలి

సమ్మెలోకి ప్రభుత్వాసుపత్రుల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి - చింతలపూడి

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు శుక్రవారం నుంచి సమ్మెలోకి వెళ్లినట్లు ఎఐటియుసి జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి తోర్లపాటి బాబు తెలిపారు. చింతలపూడి ఏరియా ఆసుపత్రి వద్ద సమ్మె శిబిరం వద్ద బాబు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు 18 నెలల పిఎఫ్, ఐదు నెలల జీతాల బకాయిలు విడుదల చేయాలని కోరుతూ గతేడాది నవంబర్‌లో ధర్నా చేయగా రెండు నెలల జీతాలు విడుదల చేశారన్నారు. డిసెంబర్‌లో మళ్లీ ధర్నా చేయగా రెండు నెలల జీతాలు విడుదల చేశారని తెలిపారు. జనవరి 13వ తేదీ ఈనెల 23వ తేదీ కల్లా పెండింగ్‌లో ఉన్న జీతాలు, పిఎఫ్‌లను విడుదల చేయకపోతే 24 నుంచి సమ్మె చేస్తామని హెచ్చరించినా వైద్యశాఖాధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా శుక్రవారం నుంచి సమ్మెలోకి దిగినట్లు చెప్పారు. వైద్యశాఖాధికారులు పిఎఫ్ డబ్బులు కట్టకుండా జీతం వరకే వేస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. సమ్మెలో పారిశుధ్య కార్మికుల విభాగం అధ్యక్షురాలు టి.మరియమ్మ, కె.శ్రీనివాసరాజు, పి.వాణి, కె.నాగరాజు, జి.దేవమణి, ఎం.సుజాత, పి.రాజకుమారి, బి.వెంకట్రావు, టి.రాము పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: ప్రభుత్వాసుపత్రిలో పని చేస్తున్న శానిటేషన్ వర్కర్లకు పెండింగ్‌లో ఉన్న జీతాలు, పిఎఫ్ వెంటనే చెల్లించాలని ఎఐటియుసి నూజివీడు నియోజకవర్గ కార్యదర్శి చాట్ల పుల్లారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నూజివీడు ఏరియా హాస్పిటల్ గేటు వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా చాట్ల పుల్లారావు మాట్లాడుతూ కార్మికులకు గుత్తేదారులు సకాలంలో జీతాలు ఇవ్వడం లేదన్నారు. మూడు నెలల నుంచి జీతాలు పెండింగ్‌లో ఉండటంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. తక్షణం ప్రభుత్వం స్పందించి కార్మికులకు సంబంధించి గుత్తేదారు వ్యవస్థను రద్దు చేయాలని, పురపాలక కార్మికుల తరహాలో ఆప్కాస్‌లో కలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏరియా హాస్పిటల్ శానిటేషన్ కార్మికులు రమాదేవి, మణి, సత్యవతి, రషీద, సుందరి, సుమలత, అజయ్, సిమోను, శ్రీను, కనకంబరం, మాలిని, నాగేశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : బుట్టాయగూడెం హాస్పిటల్ వద్ద పారిశుధ్య కార్మికుల సమ్మెకు మద్దతుగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ మాట్లాడుతూ ఆసుపత్రిలో పని చేస్తున్న అవట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు ఐదు నెలలుగా జీతాలు లేక అలమటిస్తున్నారన్నారు. పెండింగ్ జీతాల కోసం పారిశుధ్య కార్మికులు చేస్తున్న సమ్మెకు కుల వివక్ష పోరాట సంఘం తరపున మద్దతు తెలుపుతున్నామన్నారు. పారిశుధ్య కార్మికులుగా ఎక్కువ శాతం మాల మాదిగలు మాత్రమే పని చేస్తారని, రెక్కాడితే కాని డొక్కాడని వీరికి ప్రభుత్వం ప్రతి నెలా జీతాలు ఇవ్వకపోతే ఏం తిని బతుకుతారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అవుట్‌సోర్సింగ్ పద్ధతి లో హాస్పిటల్లో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు బకాయిలు ఇవ్వాలని కె.వి.పి.ఎస్ ఏలూరు జిల్లా కార్యదర్శి ఏ ఫ్రాన్సిస్ ప్రభుత్వాలు డిమాండ్ చేశారు లేని పక్షంలో ప్రజా ఉద్యమాలు ఉధ తం చేసి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో పారిశుధ్యం కార్మికుల డేవిడ్ మహిళా కార్మికులు ఔట్సోర్సింగ్ కార్మిక సూపర్వైజర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి అన్నారు. ఏలూరు అర్బన్‌లో ఉన్న కెపిడిటి హైస్కూల్, పిడిబిటి జూనియర్ కాలేజీ, సెయింట్ థెరిసా హైస్కూల్, ప్రభుత్వ బాలుర, బాలికల హై స్కూల్స్, ప్రభుత్వ జూనియర్ కాలేజీ, డిగ్రీ కాలేజీ, కస్తూరిబాయ్ పాఠశాలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు మొదటి ప్రాధాన్యత ఓటులోనే అత్యధిక మెజారిటీ ఇచ్చి గెలుపునకు పూర్తి సహాయ సహకారాలు అందించినందుకు ఉద్యోగ ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. తన గెలుపు ఉపాధ్యాయుల గెలుపని, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. ఎలాంటి సమస్య వచ్చినా తనకు నిరభ్యంతరంగా తెలియపరచి సమస్య పరిష్కరించుకోవచ్చని ఉపాధ్యాయులకు హామీ ఇచ్చారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులు ఆయనను అభినందించారు.

చేనేతకు రూ.2 వేల కోట్లు కేటాయించాలి

చేనేత కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం చేనేతకు రూ.రెండు వేల కోట్లు కేటాయించాలని, చేనేతపై జిఎస్‌టిని పూర్తిగా రద్దు చేయాలని, 200 యూనిట్లు ఉచిత కరెంటు సరఫరాకు వెంటనే జిఒ విడుదల చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏలూరు శివారు శనివారపుపేట వీవర్స్ కాలనీలో చేనేత కార్మికులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం సిఆర్‌ఆర్ కాలేజీ ఎదుట ఉన్న జిల్లా చేనేత, జౌళి శాఖ కార్యాలయంలో చేనేత అభివృద్ధి అధికారి బి.హనుమంతరావుకు సంఘం జిల్లా కార్యదర్శి పిచ్చుక ఆదిశేషు నాయకత్వంలో ప్రతినిధి బృందం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేసింది. ధర్నానుద్దేశించి ఆదిశేషు మాట్లాడుతూ కార్పొరేట్ విధానాల వల్ల చేనేత రంగం సంక్షోభంలో చిక్కుకుందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేనేతపై జిఎస్‌టి భారం వేయడంతో చేనేత రంగం మరింత సంక్షోభంలోకి నెట్టబడిందన్నారు. చేనేత రంగానికి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. నేతన్న నేస్తం పథకాన్ని మగ్గం నేస్తున్న ప్రతి చేనేత కార్మికునికి ఇవ్వాలని, బోగస్ చేనేత సహకార సంఘాలను రద్దు చేయాలని, పనిచేస్తున్న సంఘాలను ప్రోత్సహించాలని, చేనేత కార్మికులకు మూడు సెంట్ల స్థలంలో మగ్గం షెడ్డుతో కూడిన ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. చేనేత కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, సహకార సంఘాల అప్పులు రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో గుత్తి పోతురాజు, పేరక చిన్న వెంకటేశ్వరరావు, ఎర్ర సాంబశివరావు, సత్యవతి, ఎన్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న చేనేత కార్మికులు

రూ.1.50 కోట్లతో లో ఓల్టేజీ సమస్యకు పరిష్కారం

చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

నియోజకవర్గంలో లో ఓల్టేజ్ సమస్యను రూ.1.50 కోట్లతో పరిష్కరిస్తున్నట్లు చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ తెలిపారు. నగర పంచాయతీలో రూ.90 లక్షల నిధులతో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బట్టువారిగూడెం సుప్రీంపేట వడ్రకాలనీలో లో ఓల్టేజ్ సమస్య ఎక్కువగా ఉందని ప్రజలు, నాయకులు తమ దృష్టికి తీసుకురావడంతో జంగారెడ్డిగూడెం డిఇ సహకారంతో వెంటనే పరిష్కరించినట్లు తెలిపారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీర్ అహ్మద్ మాట్లాడుతూ ఎంఎల్ఎ సహకారంతో నియోజకవర్గంలో లో ఓల్టేజ్ సమస్యను పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి కూటమి నాయకులు పాల్గొన్నారు.



ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ రోషన్‌కుమార్

ఫ్రెండ్స్ హవేలి చాయ్ ప్రారంభం

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలోని పాత బస్టాండ్‌లో ఫ్రెండ్స్ హవేలి చాయ్‌ను చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపార అభివృద్ధి బాగా జరగాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కుక్కునూరు

ఆటో డ్రైవర్ గారాటం హరీష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. హరీష్ కుటుంబ సభ్యులకు ఫ్రెండ్స్ టాటా మ్యాజిక్ యూనియన్ తరపున రూ.10,500 అందించారు. దీనిలో భాగంగా ఫ్రెండ్స్ టాటా మ్యాజిక్ యూనియన్ ప్రెసిడెంట్ ఎడ్ల విజయరాజు, బడుగు మల్లేశ్వరరావు, షేక్ రహీమ్, రాంబాబు, మాచర్ల పండు, బొంత ప్రవీణ్, నాగేంద్రరావు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

130 మంది విద్యార్థులకు దంత పరీక్షలు

ప్రజాశక్తి - దెందులూరు

సెయింట్ జోసెఫ్ దంత వైద్య కళాశాల ప్రజా దంత ఆరోగ్య వైద్య విభాగం ఆధ్వర్యంలో నోటి పరిశుభ్రతపై అవగాహన, ఉచిత దంత మెగా వైద్య శిబిరాన్ని ఇందిరా కాలనీలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. పాఠశాలలోని 130 మంది విద్యార్థులకు డాక్టర్లు ఎం.పవనసంధ్య, జి.ఉదయలక్ష్మి, ప్రశాంత్, మమత, నరేష్ హెప్సిబా, మేఘన, చంద్రిక, చరిష్మా, శ్రీలక్ష్మి దంత పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. మాదేపల్లి జెడ్‌పిహెచ్ పాఠశాల హెచ్ఎం సుంకర వెంకటలక్ష్మి చేతులమీదుగా విద్యార్థులకు పేస్టులను అందించారు. దంత వైద్య శిబిరాన్ని రెవరెండ్ ఫాదర్ జి.మోజస్, ప్రిన్సిపల్ ఎన్.సెల్వరాజు ప్రారంభించారు.

పాఠశాలల సందర్శన

ప్రజాశక్తి - భీమడోలు

వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యావ్యవస్థలో మార్పులు జరుగుతాయని వార్తలు వస్తున్న నేపథ్యంలో అధికారులు ఆ ప్రయత్నాల కోసం కసరత్తు ప్రారంభించారు. దీనిలో భాగంగా మండలంలోని వివిధ పాఠశాలలను మండల ప్రత్యేకాధికారి, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు నాగరాణి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఇఒ-1 శ్రీనివాసరావు పాఠశాలల పరిస్థితి గురించి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యావ్యవస్థలో విద్యార్థుల సంఖ్య ఆధారంగా ప్రాథమిక పాఠశాలలు కొనసాగే అవకాశం ఉందన్నారు. దీనిలో భాగంగా ఒకటి, రెండు తరగతుల్లో తక్కువ విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో ఫౌండేషన్ స్కూల్‌గా నిర్వహించే అవకాశం ఉందన్నారు. ఇదే పాఠశాలలో మూడు, నాలుగు, ఐదు తరగతులు చదువుతున్న విద్యార్థులను సమీపంలో ఉన్న మరొక పాఠశాలలో విలీనం చేస్తామన్నారు. వీరు అక్కడికి చేరిన తర్వాత అందుబాటులో ఉన్న విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయుల సర్దుబాటు జరుగుతుందన్నారు. ఈ తరహా పాఠశాలలను బేసిక్ ప్రాథమిక పాఠశాలగా గుర్తిస్తారని చెప్పారు ఇక మిగిలిన పాఠశాలల్లో అందుబాటులో ఉన్న విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్య, ఉపాధ్యాయుల సర్దుబాటు కార్యక్రమం పూర్తయిన తర్వాత తరగతికి ఒకరు వంతున ఉపాధ్యాయుల నియామకం జరుగుతుందని, సదరు పాఠశాలను మోడల్ ప్రాథమిక పాఠశాలగా నిర్వహిస్తారని తెలిపారు. సందర్శనలో భాగంగా విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ ఇతర అంశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ మొబైల్ రిజర్వు టీచర్లు (సిఎంఆర్‌టి) రమణ, సత్యప్రసాద్ పాల్గొన్నారు.

జీలుగుమిల్లి :పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని మండల ప్రత్యేకాధికారి మహ్మద్ రజాఉల్ల ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని తాటియాకులగూడెం ఎంపిపిఎస్, జీలుగుమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆయన గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో నమోదైన విద్యార్థుల హాజరు శాతాన్ని, పాఠశాలకు వచ్చిన పిల్లల హాజరు శాతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు వచ్చే విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఉపాధ్యాయ సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలన్నారు. ఆయనతో పాటు ఎంఇఒ కె.శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయురాలు టి.చంద్రావతి, ఇఒపిఆర్‌డి నిఖిల్ మధుశరణ్, పంచాయతీ కార్యదర్శులు వీరలక్ష్మి, అశోక్ పాల్గొన్నారు.

చింతలపూడి:జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పంకజ్‌కుమార్ మండలంలోని స్కూల్‌ను శుక్రవారం సందర్శించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు క్లస్టర్ రీ ఆర్గనైజేషన్ యాక్చువల్ రోల్ పరిశీలనలో భాగంగా ఆయన పాఠశాలను సందర్శించారు. ప్రస్తుత రోల్ ఎంత ఉందనేది పరిశీలించారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు-1 రామారావు, ఎంఇఒ-2 కిరణ్‌బాబు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం :మండలంలోని పలు పాఠశాలల రికార్డులను మండల ప్రత్యేకాధికారి, డివిజనల్ స్థాయి అభివృద్ధి అధికారి ఎం.రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉన్న విద్యార్థుల సంఖ్యాబలం, రికార్డుల్లో ఉన్న వివరాలు, ఆన్‌లైన్ డేటాతో పోల్చి వ్యత్యాసాలను గుర్తించి కలెక్టర్‌కు నివేదిక అందించనున్నట్లు ఎంఇఒ జె.సురేష్‌బాబు తెలిపారు.

పోలవరం :మండలంలో పలు పాఠశాలల రికార్డులను మండల ప్రత్యేకాధికారి, వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ జిసిహెచ్.ప్రభాకర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో వివిధ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య వివరాలు ఆన్‌లైన్‌లో ఉన్న సంఖ్యల వివరాలు పరిశీలించినట్లు చెప్పారు. ఈ వివరాలను కలెక్టర్‌కు నివేదిక పంపనున్నట్లు తెలిపారు.

దాలినాయుడు మృతి తీరని లోటు

ఏలూరు అర్బన్:సిపిఐ ఏలూరు ఏరియా సీనియర్ నాయకులు, ఎఐటియుసి నాయకులు చింతల దాలినాయుడు (86) మృతి తీరని లోటని పలువురు అన్నారు. స్థానిక సత్రంపాడు ఎంఆర్‌సి కాలనీ వద్ద ఆయన స్వగృహంలో అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. మృతికి సిపిఐ, ఎఐటియుసి నాయకులు, పలు ప్రజా సంఘాల నాయకులు సంతాపం తెలిపారు. దాలి నాయుడు మృతదేహాన్ని సిపిఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్ సిపిఐ పతాకాన్ని ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు బండి వెంకటేశ్వరరావు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కడుపు కన్నయ్య పుష్ప మాలలు వేసి జోహార్లు అర్పించారు. ఎఐటియుసి జిల్లా కోశాధికారి పుప్పాల కన్నబాబు, ఎన్ఎఫ్ఐడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు వరక శ్యామల, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు, ఎపి ప్రజానాట్య మండలి నాయకులు పల్లి వెంకటనారాయణ నివాళులర్పించారు. దాలి నాయుడు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. దాలి నాయుడు సిపిఐకు, ఎఐటి యుసికి తీరని లోటని పలువురు అన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య దాలినాయుడు మృతదేహాన్ని సందర్శించి పుష్పమాలవేసి నివాళులర్పించారు.

నేరాలు - ఘోరాలు

700 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

చింతలపూడి:మండలంలోని నాగిరెడ్డిగూడెంలో ఎక్సైజ్ అధికారులు శుక్రవారం దాడి చేశారు. ఈ దాడిలో గ్రామం శివారులో ప్లాస్టిక్ డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన 700 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ పి.అశోక్ తెలిపారు. సదరు బెల్లపు ఊటకు సంబంధించిన వ్యక్తి కోసం గ్రామంలో గాలిస్తున్నామని తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం

ప్రజాశక్తి - కలిదిండి

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జి.కరుణకుమారి ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు, ఎంపిటిసి సభ్యులు నీలి సుమన్, ఎండి చాన్‌భాషా చేతులమీదుగా బహుమతులు అందించారు. తొలుత బేటీ బచావో - బేటి పడావో వంటి నినాదాల బోర్డులను ప్రదర్శిస్తూ ర్యాలీ చేశారు. అంగన్వాడీలు ఎస్‌కె.అభిదాబేగం, కె.విజయకుమార్, బి.రామలక్ష్మి, ఆశాలు వై.ప్రభావతి, విజయలక్ష్మి, ఎస్.సూర్యకళావతి, ఎఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉంగుటూరు : బాల్య వివాహాలు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకునే విధంగా చట్టాలు ఉన్నాయని, తల్లితండ్రులు అవగాహన కలిగి చిన్న వయస్సులో పెళ్లిళ్లు చేయవద్దని ఉంగుటూరు ఎంపిపి గంటా శ్రీలక్ష్మి అన్నారు. ఉంగుటూరులో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలు-అనర్థాలపై శుక్రవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని సర్పంచి బండారు సింధు మధుబాబు ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా ఎంపిపి శ్రీలక్ష్మి హాజరై అంతర్జాతీయ బాలిక దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. సెక్టార్ సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, బాలికలు గ్రామస్తులు పాల్గొన్నారు. నారాయణపురంలో అంగన్వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాఠశాలలో బాలిక దినోత్సవాన్ని నిర్వహించారు.

చాట్రాయి :జాతీయ బాలిక దినోత్సవం కార్యక్రమాన్ని మండలంలోని తుమ్మగూడెం ఎంపిపిఎస్ ఉర్దూ పాఠశాలలో హెచ్ఎం గంపా వెంకట్రావు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం పాఠశాలలోని బాలురు బాలికలకు శాలువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలోఎస్ఎంసి ఛైర్మన్ షేక్ హసీనా, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కలిదిండిలో...

మండవల్లి : జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలోఎంఇఒ రత్నసునాదం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం కిశోర బాలికలకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రామలింగేశ్వరరావు, సిడిపిఒ దీప్తి, ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, సూపర్‌వైజర్ నాగలక్ష్మి, లక్ష్మీప్రసన్న, అంగన్వాడీ కార్యకర్తలు జయలక్ష్మి, సుధారాణి, ఉమాదేవి, నాగలక్ష్మి, సరస్వతి దేవి పాల్గొన్నారు.

దెందులూరు : ఇందిరా కాలనీలోని ఎంపియుపి పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు గగ్గులోతు కృష్ణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు టి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు రమా కుమారి, మెర్సీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ముదినేపల్లి : మండలంలోని బొమ్మినంపాడు హైస్కూల్‌లో నిర్వహించిన జాతీయ బాలిక దినోత్సవ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రసన్న పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు చిరంజీవులు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

ముసునూరు : చింతలవల్లి శివారు గోగులంపాడు ఎంపిపి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.సురేష్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో అంగన్వాడీ సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు.

ఏలూరు అర్బన్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం కళాశాల మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గుత్తా గిరిబాబు అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత విభాగం కోఆర్డినేటర్ డాక్టర్ పిఆర్.కావ్యశ్రీ, వృక్ష శాస్త్ర అధ్యాపకురాలు టివిఎస్.పద్మావతి, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.రాంబాబు, వివిధ విభాగాల అధ్యాపకులు కె.అజయ్‌కుమార్, వి.వెంకట్రావు, ఎస్.పరమేశ్, డాక్టర్ ఎం.విజయ్‌కుమార్, ఎం.కృష్ణచైతన్య పాల్గొన్నారు.

పంటలకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నిర్ధారణ

కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు:2025-26కు సంబంధించి వివిధ పంటలకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను నిర్ధారించినట్లు కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశ మందిరంలో జిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సాంకేతిక కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ, మత్స్యశాఖ, ఉద్యాన, పశుసంవర్ధక శాఖలకు సంబంధించి వివిధ రకాల రుణాల మంజూరు కోసం స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను నిర్ధారించినట్లు చెప్పారు. వివిధ పంటలు, పాడిపశువుల పెంపకానికి, చేపల పెంపకానికి సంబంధించి పెంచిన రుణపరపతి వివరాల ప్రతిపాదనలను రాష్ట్రస్థాయి సాంకేతిక కమిటీకి పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డిసిసిబి సిఇఒను ఆదేశించారు. ఈ సమావేశంలో డిసిసిబి సిఇఒ తిలక్ నారా, నాబార్డ్ డిడిఎం పి.అనీల్‌కాంత్, ఎల్‌డిఎం డి.నీలాద్రి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్‌కె.హబీబ్‌భాషా, ఉద్యానశాఖ డిడి ఎస్.రామ్మోహన్, సెరీకల్చర్ డిడి డి.వాణి, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, కూరగాయల రైతు సంఘం జిల్లా ప్రెసిడెంట్ కట్టా భాస్కరరావు, కొబ్బరి రైతు సంఘం నాయకులు ఘంటా పాపారావు, పశుసంవర్ధకశాఖ, మార్కెటింగ్ అధికారులు, పలువురు బ్యాంకు కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

గోదావరిలో చేప పిల్లల విడుదల

ప్రజాశక్తి - పోలవరం

మండలంలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం గోదావరిలో చేపపిల్లల సీడ్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు అనారోగ్యం కారణంగా పాల్గొనలేకపోయారని మత్స్యశాఖ జిల్లా అధికారి జెఎస్ఐ నాగలింగాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం, గూటాల గ్రామాల్లో 20 లక్షల చేప పిల్లల సీడ్‌ను గోదావరిలో విడుదల చేసినట్లు చెప్పారు. పోగొండ, జల్లేరు జలాశయాల్లో 1.20 లక్షల చేప పిల్లల సీడ్‌ను ఎంఎల్ఎ బాలరాజు ఆధ్వర్యంలో విడుదల చేసినట్లు తెలిపారు.

ప్రోటోకాల్ పాటించలేదు : పోలవరం సర్పంచి

గోదావరి నదిలో చేప పిల్లలను వదిలే కార్యక్రమానికి మత్స్యశాఖ అధికారులు ప్రోటోకాల్ పాటించలేదని పోలవరం సర్పంచి పొడుం పుష్ప శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చేపలు గోదావరి నదిలో వదిలే కార్యక్రమానికి తనను ఆహ్వానించలేదని, పంచాయతీకి కూడా సమాచారం ఇవ్వలేదని తెలిపారు. దీనిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి పిలిచిన వారిలో ప్రజా ప్రతినిధులు ఎవరూ లేరని తెలిపారు.

మినుము పంటలో తెగుళ్లను నివారించాలి

మండవల్లి :మినుము పంటకు ఆశించే తెగుళ్లను సకాలంలో గమనించి నివారించుకుంటే అధిక దిగుబడి సాధించవచ్చని సహాయ వ్యవసాయ శాఖ సంచాలకులు జి.వెంకటమణి స్పష్టం చేశారు. మండలంలోని పెరికేగూడెంలో మినుము పంట పొలాలను రైతులతో కలిసి ఆమె శుక్రవారం పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇఒ ఎస్‌కె.జరీనా, సాగునీటి సంఘం అధ్యక్షులు ఎనికె రాంబాబు, రైతులు పాల్గొన్నారు.

రహదారులే అభివృద్ధికి చిహ్నాలు

మండవల్లి:గ్రామాల్లో నిర్మిస్తున్న రహదారులే అభివృద్ధికి చిహ్నాలని కైకలూరు ఎంఎల్ఎ కామినేని శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని భైరవపట్నం చావలపాడులో పల్లెపండుగ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను ఆయన నాయకులు, కార్యకర్తలతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. వైసిపి ఐదేళ్ల ప్రభుత్వ పాలనలో రహదారులన్నీ ధ్వంసం అయిపోయాయని, రహదారులపై ప్రయాణించేందుకు ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని చెప్పారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను తొలగించే విధంగా ఎక్కడా కూడా కనీసం మట్టి పోసి గుంతలు పూడ్చిన దాఖలాలు లేవన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రహదారులు, డ్రెయినేజీ అభివృద్ధికి, స్వచ్ఛమైన తాగునీరందించే విధంగా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. అందుకు అవసరమైన నిధులను కేటాయించి సంక్రాంతి లోపే రహదారులు నిర్మించి అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.

చొప్పరమణగూడెంలో పశు ఆరోగ్య శిబిరం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని చొప్పరమణగూడెం రైతు సేవా కేంద్రంలో శుక్రవారం పశుఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఆవులు, గేదెలు, దూడలతో సహా పశువులకు నట్టల నివారణ మందులు అందించారు. మొత్తం 22 ఆవులు, 55 గేదెలు, 62 దూడలకు మందులు పంపిణీ చేయగా ఆరు గర్భకోశ పరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు. 60 మేకలు, గొర్రెలకు పాక్స్ వాక్సిన్ ఇంజక్షన్లు ఇచ్చి నట్టల నివారణ మందు తాగించారు. వెయ్యి కోళ్లకు కొక్కర తెగులు రాకుండా టీకాలు వేశారు.

నారాయణపురం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఉంగుటూరు

జాతీయ ఓటర్ దినోత్సవం పురస్కరించుకుని ఏలూరు కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నథింగ్ లైక్ ఓటింగ్, ఐ ఓట్ ఫర్ షూర్ అంశాలపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. జిల్లాలోని అన్ని కళాశాలల నుంచి విద్యార్థులు హాజరై పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో నారాయణపురం శ్రీ అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బిఎ మొదటి సంవత్సరం చదువుతున్న జి.అనూష వ్యాసరచనలో జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతిని సాధించగా, బీకాం సెకండియర్ విద్యార్థి బి.సుమంత్ వక్తృత్వ పోటీల్లో జిల్లాలో మూడో బహుమతిని సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టికె.విశ్వేశ్వరరావు, అధ్యాపకులు విజేతలను అభినందించారు. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన ఆర్ట్స్ విభాగ అధ్యక్షులు నిర్మల జ్యోతి, వైస్ ప్రిన్సిపల్ డి.రెడ్డయ్య, అకడమిక్ కో ఆర్డినేటర్ డాక్టర్ కొండ రవి, గాబ్రియేల్, తదితరులు విద్యార్థులను అభినందించారు.

దోమల నిర్మూలన అందరి బాధ్యత

జిల్లా మలేరియా అధికారి ప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఒక చిన్న కాటు ద్వారా అనేక ప్రాణాంతక వ్యాధులు వ్యాప్తి చేసే చిన్న కీటకం దోమ అని, దోమను ప్రధాన శత్రువుగా భావించి దోమల నిర్మూలనలో ప్రజలు భాగస్వామ్యం కావాలని జిల్లా మలేరియా అధికారి పిఎస్.ప్రసాద్ సూచించారు. స్థానిక ఏలూరు పట్టణ ఆరోగ్య కేంద్రం తాపీ మేస్త్రి కాలనీ, లంకపేట ప్రాంతాల్లో శుక్రవారం నిర్వహించిన డ్రైడే కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ మనకు ఎక్కువగా హాని చేసే కీటకాల్లో దోమ ఒకటని, దోమకాటు మనకు కనిపించదని, అందువల్లే దోమ పుట్టకుండా చేయాలని సూచించారు. డెంగీ, మలేరియా కారక దోమలు మన గృహాల్లో ఉండే మంచినీటి నిల్వ ప్రాంతాల్లో ఉంటాయన్నారు. అందరూ ప్రతి శుక్రవారం పొడి వారంగా డ్రై డేగా పాటించాలని తెలిపారు. జ్వరం వస్తే అశ్రద్ధ చేయకుండా ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించాలని, డెంగీ, మలేరియా పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని సూచించారు.

వైకల్యం నివారణపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - దెందులూరు

వికలాంగులకు ప్రభుత్వం ప్రత్యేక హక్కులను కల్పించిందని, వాటిని తెలుసుకుని సద్వినియోగం చేసుకోవాలని ఉమా ఎడ్యుకేషన్, టెక్నికల్ సొసైటీ కో-ఆర్డినేటర్ శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. ఏలూరు దొండపాడులో ఉన్న ఉమా ఎడ్యుకేషన్, టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా వికలాంగుల పునరావాస కేంద్రం వారు శుక్రవారం మాగంటి ఆంజనేయ సరస్వతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (చాటపర్రు)లో 2016 వికలాంగుల హక్కుల చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు.

CHANGE OF NAME

I, **BALAM VENKATA LAKSHMI** W/o. Balam Venkatesh, D.No. 2-112, Near RCM Church, Kalipatnam, Mogalturu Mandal, W.G.Dt, A.P. I have changed my name from **BALAM VENAKTA LAKSHMI** (Old name) to **BALAM VENKATA LAKSHMI** (New name) hence forth I am being called **BALAM VENKATA LAKSHMI** W/o.Balam Venkatesh, for all purposes.

పాస్‌పోర్టు పోయినది

పాలకొల్లు పట్టణం, డోర్ నెం.50-7-5A, 22వ వార్డు, కొత్తపేట, పాలకొల్లు, ప॥గో॥జిల్లా ఎ.పి కి చెందిన శ్రీరా లతా మంగేష్కర్, భర్త: శ్యాంబాబు, పాలకొల్లు తెలియజేయునది ఏమనగా నేను వైజాగ్ పాస్‌పోర్టు ఆఫీస్ నుండి 01-01-2003 న **E4366251. నెంబర్, పాస్‌పోర్టు** తీసుకున్నాను. నేను నా ఒరిజినల్ పాస్‌పోర్ట్‌ను తీసుకొని ది. 17-01-2025 న పాలకొల్లులోని మా ఇంటి నుంచి మెయిన్ రోడ్‌కు జెరాక్స్ తీయించుటకు కేంద్రంకు వెళ్ళగా నేను వైజాగ్‌లో పొందిన నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ పడిపోయింది. దారిలో ఎంత వెతికినను ఎక్కడా నాకు నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ దొరకలేదు. కాబట్టి ఎవరికైనా దొరికితే నా పై అడ్రస్ కు ఇవ్వాల్సిందిగా కోరి ప్రార్థిస్తున్నాను.

నా సెల్ నెంబర్: 9949949289

ఆటల్లో గెలుపోటములు సహజం

రిపబ్లిక్ డే సందర్భంగా విద్యార్థులకు పలు పోటీలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండల పరిధిలోని గొల్లపల్లిలో ఉన్న శ్రీ అన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జనవరి 26 రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా వివిధ అంశాల్లో ఆటల పోటీలు నిర్వహించారు. జూనియర్, సీనియర్ బాలురు, బాలికల విభాగంలో కబడ్డీ, జూనియర్, సీనియర్ బాలుర, బాలికల విభాగంలో వంద మీటర్ల పరుగు పందెం, షాట్‌పుట్ నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుని పి.రాధికారాణి తెలిపారు. పాఠశాల కమిటీ ఛైర్మన్ భావిశెట్టి వీరయ్య, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు రవీంద్ర, లక్ష్మి, మల్లేశ్వరి, కృష్ణవేణి, కోటేశ్వరమ్మ, సౌజన్య, రాధికారాణి, విఠల్‌బాబు, మోహన్‌రావు, సాకా రవి, నాన్ టీచింగ్ సిబ్బంది వరలక్ష్మి, నారాయణ, రంగారావు, ఈ స్కూల్‌లో పనిచేసి బదిలీపై వెళ్లిన ధనలక్ష్మి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఆటలో గెలుపోటములు సహజమని క్రీడాస్ఫూర్తితో మెలగాలని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలకు కంప్యూటర్లు బహూకరణ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలకు శుక్రవారం ఐడిబిఐ (ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) మేనేజర్ ప్రదీప్ విజయ్ ప్రభుత్వ పాఠశాలలకు సుమారు రూ.1.25 లక్షల విలువైన నాలుగు కంప్యూటర్లను బహుకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి తగరం సుజాత, పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ కొమ్ము విజయకుమార్, గ్రామ పెద్దలు కొమ్మన నాగేశ్వరరావు, అక్కినేని చందు, బెనర్జీ, చలసాని రామారావు పాల్గొన్నారు.

మూగ జీవాలకు నట్టల నివారణ మందు

ప్రజాశక్తి - ముసునూరు

మూగ జీవాలకు నట్టల నివారణ మందు వేస్తే ఆరోగ్యకరంగా ఉంటాయని టిడిపి గ్రామ అధ్యక్షులు కాట్రు రామస్వామి అన్నారు. మండలంలోని బలివే సచివాలయంలో గొర్రెలకు, మేకలకు పలు మూగ జీవాలకు నట్టల నివారణ మందు పశు శాఖ వైద్యులు వెంకట చైతన్య ఆధ్వర్యంలో వేశారు.

నరసాపురం పురపాలక సంఘము

'e' ప్రొక్యూర్మెంటు టెండర్ నోటీసు

ఆర్.ఒ.సి. నెం. 249/2023-ఇ.1. ది. 24-01-2025
మరియు 587/2025-ఇ.2.

నరసాపురం పురపాలక సంఘము నందు 15వ ఆర్థిక సంఘం నిధులు & మునిసిపల్ సాధారణ నిధులతో వివిధ పనులు చేపట్టుటకు

1.బిడ్ అమ్మకం ప్రారంభ తేది మరియు సమయం : 25-01-2025 ఉ॥గం.11.30 లకు
2.బిడ్ దాఖలు ముగింపు తేది మరియు సమయం : 12-02-2025 సా॥గం.4.00 లకు
3.ప్రైస్ బిడ్ తెరువు తేది మరియు సమయం : 12-02-2025 సా॥గం.4.30 లకు

తదుపరి వివరాలను **www.eprocurement.gov.in** లోని 'e' ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ నందు చూడవచ్చును.

కమిషనర్
నరసాపురం మున్సిపాలిటీ.
నరసాపురం పురపాలక సంఘం
నరసాపురం ఫోన్ నెం. 08814-273332

TADEPALLIGUDEM MUNICIPALITY

E-PROCUREMENT TENDER NOTICE

Roc. No.2422/E1/2023-24 Dated.24-01-2025

Sl. No.	Name of the Work	Name of the Grant	Estimate Value (Rs. in Lakhs)	Bid Downloading Start Date	Last Date for Receipt of Bids
1	Supply and delivery of tyres and tubes for compactors, replacement of starlers at head water works and repairs and patch works works-04 Nos 4	General Funds	16.46	25-01-2025	01-02-2025

Full details can be had from the Municipal Engineering Department during working hours or visit web site http://tender.apeprocurement.gov.in

Sd/- **COMMISSIONER**
TADEPALLIGUDEM MUNICIPALITY

In The Court Of The Assistant Commissioner of Labour Eluru (W.G.Dt)
W.C.No.17/2024

Between:
Janapareddy Nagalakshmi & anothers ... *Applicants*
and
P. Suryakala and Others ...*Opp. Partyes*
To:
1st opp.party: P. Suryakala, W/o (Late) Venkata Reddy, owner of Lorry (Oil Tanker) **No. Ap 37 V 1178, R/o D.No. 20C-11-31,** Gandhi Nagar, Eluru (W.G.Dt).

మీరు పై తెలిపిన **W.C No. 17/2024** లో 1st opposite Party అయి వున్నారు. మీకు ఎన్నిసార్లు సమన్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున Hon`ble Assistant Commissioner of Labour, Eluru వారి ఉత్తరువు ప్రకారం మీరు **ది. 4-02-2025 తేదీన మధ్యాహ్నం 3:00 గం॥లకు** శ్రీ కోర్టు వారి ఎదుట హాజరయి మీ ఆక్షేపణలను శ్రీ కోర్టు వారితో మనవి చేసుకోవలసినది. లేని యెడల సదరు విషయమై మీ పరోక్షమున విచారించి తీర్మానము చేయుదురని తెలియ చేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

Applicants తరుపు న్యాయవాది
G.J.V.R.G. SIVA SANKAR
Advocate, Eluru
Eluru
Dt. 24-01-2025.
Cell: 9666463737

మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
I.A.No. 153/2017 in O.S.No. 93/2012

Between:
Bolla Venkata Narayana ...**Petitioner/1st Defendent**
and
Bolla Perayya (Died) Bollempalli Krishnaveni & others ...*Respondent/Plaintiff*
Respondent No.5 : Bollempalli krishnaveni, W/o Satyanarayana, C/o Ch. Vasu Prakash, Annapoorna Apartments, Sivaji palem, Visakhapatnam.

యీ నెంబరు పై Sec-5 of Limitation Act Pelition లో 5వ రెస్పాండెంటుకు ఎన్ని పర్యాయములు Notice లు అమలు జరిపించినను సదరు 5th Respondent ను పిటీషనర్ చిక్కులు పెట్టవలెననీ దురుద్దేశ్యముతో కాలయాపన చేయుచున్నారు. ఆమెకు నోటీసులు అమలు జరగనందున శ్రీ కోర్టు వారు Substitute of Service ద్వారా పేపరు ప్రకటనకు ఆర్డరు వేసి సదరు రెస్పాండెంటు హాజరు నిమిత్తము **ది.03-02-2025వ తేదీకి** వాయిదా వేసివున్నారు. కావున సదరు వాయిదాకు సదరు పై 5వ రెస్పాండెంటు స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని **ఉదయం 10-00 గం॥లకు** శ్రీ కోర్టు వారి యెదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని ఎడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

ఎన్. ఆనంద చక్రవర్తి, బి.కాం.బి.ఎల్.
అడ్వకేట్
నరసాపురం
నరసాపురం
ది. 24-01-2025
సెల్: 9849145267

నోటీసు
మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P. 1/2024, O.S. 221/2005

Between:
DHr: Smt. Dharnalakota Annapurna
JDr's: 1. Smt. Polanati Savitri (died)
2. Sri. Vaddi Venkata Rao and 9 Others
To:
7. Smt. Buddala Durga Parvathi, W/o. Lakshmana Rao, Attili, Attili Mandal.
8. Sri. Musireddi Nageswara Rao, S/o. not known, Bayyanagudem, Koyyalagudem Mandal.
9. Sri. Musireddi Veera Venkata Satyanarayana Prasad, S/o. Nageswara Rao, Bayyanagudem
10. Sri. Musireddi Subba Rao, S/o. Nageswara Rao, Bayyanagudem
11. Smt. Anisetti Annapurna, D/o. Musireddi Nageswara Rao, Bayyanagudem.

పై నెంబరులోని DHr పై నెంబరు E.P. ని మీ వగైరాలపై పై నెంబరు E.P. షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని ఒప్పగింత చేయమని దాఖలు చేయగా సదరు E.P. నందు 7 టు 11 JDR's అయిన మీకు ఎన్నిసార్లు నోటీసులు కోర్టు ద్వారా మరియు రిజిస్టరు పోస్టు ద్వారా పంపించినను మీరు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు సబ్‌స్టిట్యూట్ సర్వీసు ద్వారా ఆర్డరు వేసి వున్నారు. కావున పై నెంబరు E.P. నందు మీకు ఎట్టి అభ్యంతరములు వున్ననూ మీరు **ది. 30-01-2025వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరై తెలియపరచుకొనవలెను. లేనిచో మీ పరోక్షముగా తీర్మానించడమగును.

MADDIPATI SRINIVAS
Station: Kovvuru Advocate, Kovvuru
Date: 20-01-25 Cell: 93466 50165

ప్రకటన
మహారాజశ్రీ ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) తణుకు
E.P.No.179/2011, O.S.No.637/2008

పిటీషనర్/DHR: K.M.V.పద్మ కుమారి
And
JDR : పినిపే నాగేశ్వరరావు వగైరా
మార్ట్‌గేజర్ లీడర్ హైర్స్ :
1.మానూరి పరిపూర్ణ, W/o.మానూరి సూర్యనారాయణ, NTR విగ్రహం దగ్గర, తేతలి, తణుకు రూరల్ మండలం.
2.మానూరి దుర్గారావు, ప్రైవేటు ఎంప్లాయి, NTR విగ్రహం దగ్గర, తేతలి.
3.మానూరి సుధాకర్, తాపీమేస్త్రి, NTR విగ్రహం దగ్గర, తేతలి.
4.మానూరి దివాకర్, S/o.సూర్యనారాయణ, తాపీమేస్త్రి, NTR విగ్రహం దగ్గర, తేతలి.

పై నంబరు గ్రంథములో DHR, JDR లపై దావా డిక్రీ పొంది అత్తిలి గ్రామం, ఇంటి ప్రాపర్టీ వేలం కొరకై EP దాఖలు చేయగా సదరు ఆస్థి మానూరి సూర్యనారాయణ, S/o.సత్యనారాయణ, తేతలి గ్రామం వారికి 25-8-2000 సంవత్సరంలో అత్తిలి సబ్‌రిజిస్ట్రారు ఆఫీసులో తనఖా ఉన్నట్లు మరియు కోర్టు వారి ఆర్డరుపై మానూరి సూర్యనారాయణ గార్కి శ్రీకోర్టు వారు వారి అభ్యంతరములు కొరకు నోటీసు చేయగా మానూరి సూర్యనారాయణ గారు చనిపోయినట్లు ఎండార్స్‌మెంట్ రాగా పైన 1 to 4 వారలు వారి వారసులకు వారి తరపు అభ్యంతరములు చెప్పుకొనుటకు శ్రీకోర్టు వారి ఎదుట 03 ఫిబ్రవరి 2025 తేదీలో హాజరై తనఖాపై వారి అభ్యంతరములు తెలియజేయవలసి ఉన్నది. సదరు తేదీలో మీ ఆక్షేపణలు తెలియజేయనిచో శ్రీకోర్టు వారి చర్యలకు బాధ్యులగుదురు.

బండారు సుబ్బారావు
అడ్వకేట్, తణుకు.
తణుకు
08-01-2025
సెల్: 9381784461